విద్యార్థులను ఒత్తిడి చేస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏ విద్యార్థికి హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాకుండా నిరోధించడం చేస్తే అటువంటి కళాశాలలు, పాఠశాల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటికే అన్ని కళాశాలలకు యూజ్ నోటీసు కూడా పంపించినట్లు తెలిపారు. జిల్లాలోని పలు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల నుండి ఫీజులు చెల్లించాలని ఒత్తిళ్లు తెస్తున్నట్లు, తరగతులకు హాజరు కానీయకుండా, హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా పరీక్షలకు హాజరయ్యేందుకు ఆటంకం కల్గిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాలలకు నేరుగా విడుదల చేస్తామని, పాత బకాయిలు కూడా క్రమంగా చెల్లిస్తామని స్పష్టంగా ప్రకటించిందన్నారు. ఈ విషయాన్ని కళాశాలల యాజమాన్యాలకు తెలియ జేశామన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

రైతు, కార్మికుల సమస్యలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలి

26న దేశవ్యాప్త ఆందోళన జయప్రదం కోరుతూ కడపలో బైక్ ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న ట్రేడ్ యూనియన్, రైతు, వ్యవసాయ, మున్సిపల్, అంగన్వాడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను అన్ని వర్గాల ప్రజలు ప్రతిఘటించాలని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ 13 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా జిల్లా కేంద్రాలలో ఈనెల 26 దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం ఎఐటియుసి, సిఐటియు, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కడపలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కార్పొరేషన్ కార్యాలయం, కోటి రెడ్డి సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, అప్సర సర్కిల్, కృష్ణ సర్కిల్, ఎన్ఆర్ సర్కిల్ వరకు సాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ సెక్రటరీ బాదుల్లా, రైతు సంఘాలు నాయకులు సుబ్బారెడ్డి, దస్తగి రిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు సి. సుబ్రహ్మణ్యం, అన్వేష్ మాట్లా డుతూ దేశవ్యాప్తంగా కార్మికులు రైతులు పదేళ్ల కిందట పెట్టిన 15 డిమాండ్లలో ఏ ఒక్క కోర్కెను మోడీ ప్రభుత్వ నెరవేర్చలేదని విమర్శించారు. మధ్య తరగతి ప్రజలు పన్నులు చెల్లించలేక పేదరికంలోకి జారుకుంటున్నట్లు నివేదికలు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. రైతులు, కార్మికులు మరింత పేదరికంలోకి నెట్టబడడానికి మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో కార్పొరేట్లకు రూ.12 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి ప్రపంచ కుబేరుల స్థానంలో అదానీ, అంబానీలు ఎదగడానికి మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా సహాయపడుతుందన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పరిశ్రమలలో కార్మికుల జీవితాలకు భద్రత కల్పించేలా సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధిని కేటాయించాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మికులను బానిసత్వం నుంచి విడుదల చేయాలని, కౌలు రైతులకు భూయజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. పంట రుణాలు, నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలను కల్పించి రోజు వేతనం రూ.600 చెల్లించాలని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులు నిరుద్యోగులతో తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ 26న కడపలో కళాక్షేత్రం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగే కార్మిక కర్షక ఐక్య ధర్నాలో పెద్దసంఖ్యలో నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ కడప నగర కార్యదర్శి ఎన్. వెంకట శివ, ఏఐటియుసి కడప నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్ నాయకురాలు బి.లక్ష్మి దేవి, లక్ష్మి దేవి, రైతు సంఘం నాయకులు మనోహర్ రెడ్డి , గడం శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తారక రామారావు విజయ్, సుంకర రవి, గోపి, కేశవ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- స్కూటర్‌ను ఢీకొన్న టిప్పర్ లారీ
- భార్యాభర్తలు, కుమార్తె దుర్మరణం
- శుభకార్యం కోసం వస్తూ ఘటన

దుర్మరణం చెందిన శ్రీనివాసులరెడ్డి, అరుణ, పవిత్ర

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మండలంలోని మైదుకూరు-పోరుమామిళ్లలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్కూటర్‌ను లారీ ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాలు.. కాశినాయన మండలం చిన్నాయపల్లె గ్రామానికి చెందిన గుర్రాల శ్రీనివాసులరెడ్డి (45), అరుణ (35), పవిత్ర (12) మైదుకూరులో సమీపంలోని తిప్పాయపల్లె గ్రామంలో ఓ శుభకార్యానికి స్కూటర్‌పై బయలు దేరారు. ముందుగా మైదుకూరు పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న వారి కుమారుడిని కలిశారు. అనంతరం తిప్పాయపల్లెకు పయనమయ్యారు. మైదుకూరు మండలంలో ముద్దిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఎద్దడు కనుమ వద్దకు రాగానే స్కూటర్‌ను వెనుకవైపు నుంచి టిప్పర్ లారీ ఢీకొట్టింది. లారీ ఢీకొట్టి వారిపై నుంచే వెళ్లడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. లారీ ఆపకుండా వెళ్లడంతో స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. విషయం తెలు సుకున్న మైదుకూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకేకుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో వారి స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థుల శ్రేయస్సే ధ్యేయం

పిఎంఎజివై కింద దళిత కాలనీల అభివృద్ధి
సోషల్ వెల్ఫేర్ జిల్లా జాయింట్ డైరెక్టర్ సరస్వతి వెల్లడి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల శ్రేయస్సే ధ్యేయంగా జిల్లా సాంఘిక సంక్షేమశాఖ పని చేస్తోంది. ఇందులో భాగంగా ప్రీమెట్రిక్ హాస్టల్స్, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్ మొదలుకుని 67 హాస్ట ళ్లలో 7,142 మంది విద్యార్థులకు వసతి, మెరుగైన పోషకాహారంతో కూడిన స్కాలర్‌షిప్ సదుపాయాలు కల్పిస్తోంది. హాస్టళ్లలో మెరుగైన వసతుల కల్పన, మెస్‌ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీల వరకు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి సామాజిక సమతుల్యత సాధనకు కృషి చేస్తున్నాం. దీనికితోడు పిఎంఎజివై స్కీమ్ కింద సుమారు 20 దళిత గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సోషల్ వెల్ఫేర్ జిల్లా జాయింట్ డైరెక్టర్ సరస్వతమ్మ పేర్కొన్నారు.

జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లెన్ని?

సాంఘిక సంక్షేమశాఖ కింద 67 హాస్టళ్లున్నాయి .కోవిడ్-19 వైరస్ విజృంభణకు ముందు 12 వేల మంది ఉండేవారు. కోవిడ్-19 అనంతరం 7,142 మంది విద్యార్థులు ఉన్నారు.

కాస్మోటిక్ ఛార్జీల వివరాలు తెలపండి?

జిల్లా సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని 67 హాస్టళ్లలోని 7,142 మంది విద్యార్థులకు వివిద కేటగిరీల కింద చెల్లిస్తున్నాం. మూడవ తరగతి నుంచి నాలుగవ తరగతి వరకు నెలకు రూ.1,150, ఐదు నుంచి టెన్త్ వరకురూ.1,400, ఇంటర్ ఆపైన విద్యార్థులకు రూ.1,600 చొప్పున నెలకు ప్రీమెట్రిక్ కాస్మోటిక్ ఛార్జీలను పెంచాం.

పెంచిన కాస్మోటిక్ ఛార్జీల వివరాలు తెలపండి?

2021-22లో ప్రతిఒక్క విద్యార్థికీ రూ.120 చొప్పన కాస్మోటిక్ ఛార్జీలను సైతం చెల్లించడం తెలిసిందే. తాజాగా పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం పెంపుదల చేసింది. ఇందులో మూడవ తరగతి బాలురకు నెలకు రూ.50, మూడు నుంచి నాలుగవ తరగతి బాలురకు రూ. 125, బాలికలకు రూ.130, ఏడు నుంచి ఇంటర్ వరకు బాలురకు రూ.150, బాలికలకు రూ.200, ఇంటర్ విద్యార్థులకు రూ.250 చొప్పున పెంపుదల చేసింది.

పిఎంఎజివై స్కీమ్ పనితీరు ఎలా ఉంది?

పిఎంఎజివై స్కీమ్ చురుకుగానే పట్టాలెక్కుతోంది. ఇందులో 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో దళితులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంపై దృష్టి సారించడమైంది. ఇందులో భాగంగా 20 గ్రామాలను ఎంపిక చేయడమైంది. ఇందులో గ్రామానికి రూ.20 లక్షల చొప్పన మిగిలిన డిపార్టు మెంట్ల నుంచి సుమారు గ్రామానికి రూ.కోటి వ్యయంతో కూడిన అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

పిఎంఎజివై పనుల వివరాలు తెలపండి?

జిల్లాలోని రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన బద్వేల్ నియోజకవర్గంలో అత్యధికంగా ఎస్‌సి పాపులేషన్ జనాభా ఉన్నట్లు తెలుస్తోంది. ఎంపిడిఓల నుంచి నివేదిక అందాల్సి ఉంది. ఎంపిడిఓలు అందించే సర్వే నివేదికను బట్టి అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. ఇందులో రోడ్లు, డ్రెయి నేజీలు, తాగునీటి సదుపాయాల కల్పన పనులకు ప్రాధాన్యత ఉండే అవకాశం ఉంది.

పెండింగ్ ఫీజురియింబర్స్‌మెంట్ చెల్లించేదెప్పుడు?

పెండింగ్ ఫీజురియింబర్స్‌మెంట్ నిధులు చెల్లింపుల గురించి స్పష్టత లేదు. ప్రస్తుతం చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు డిసెంబర్ లోపు దరఖాస్తులు చేసుకోవాలి. పెండింగ్ బకాయిలు సైతం డిసెంబర్‌లో విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

సంక్షేమ హాస్టళ్ల సిబ్బంది కొరత గురించి మాట్లాడండి?

హాస్టళ్లలో సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. సంక్షేమ హాస్టళ్లలో 23 కేటగిరీలో 409 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 18 పోస్టుల కొరత వేధిస్తోంది. వీరిలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, సూపరిటెండెంట్, 16 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ -11 మంది ఆఫీసర్ల కొరత వేధిస్తోంది.

నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

అదానిని అరెస్టు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

అవినీతి అదానిని అరెస్టు చేయాలని సిపిఎం పట్టణ కమిటీ ఏసుదాసు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ సర్కిల్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాసరి విజయ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గౌతమ్ అదాని ఆర్థిక నేరాలను అమెరికా న్యాయశాఖ బయట పెట్టిందన్నారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్రస్థాయి ఒప్పం దాలను పొందేందుకు నాలుగు రాష్ట్రాల అధికారులకు, అప్పటి అధికార పార్టీ నాయకులకు రూ. 20 వేల 100 కోట్లు లంచాలుగా ఇచ్చి సోలార్ విద్యుత్ అనుమతులు పొందారని తెలిపారు. ఈ లంచంలో అధిక మొత్తం గత ప్రభుత్వ వైసిపి నాయకులకు అధి కారులకు రూ. 17 వేల.750కోట్లు. లంచాలు సెకి అనుమతుల కోసం ఇచ్చారని అమెరికా ప్రభుత్వం వెల్లడించిందని చెప్పారు. గుజరాత్‌లో ఎన్‌టిపి సి నుండి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక యూనిట్ ఒక రూపాయి 99 పైసలుకు కొనుగోలు చేస్తుందన్నారు. అదే విద్యుత్తును అప్పటి వైసిపి ప్రభుత్వం 2 రూపాయల 49 పైసలకు కొనుగోలు చేసిందని, ఈ విధంగా లక్షల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపిందని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని అప్పటి వైసిపి నాయకులు ఈ దోపిడీలో పాలు పంచుకున్నారని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరిగిన ఎపి సీఎం చంద్రబాబు అసెంబ్లీలో పరిశీలిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ప్రజల నెత్తిన రూ.17 వేల 750 కోట్లు సర్దుబాటు విద్యుత్ ఛార్జీలను వైసిపి ప్రభుత్వం మోపిందని చెప్పారు. ఇకనైనా రాష్ట్ర కూటమి ప్రభుత్వం మోసాలను వెలికి తీసి ఎపిలో ఆదాని సంస్థలను రద్దు చేయాలన్నారు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన నేరాల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైఖేల్, శీను, రాజేష్, బీమా, ప్రజలు పాల్గొన్నారు.

మానవత్వానికి పట్టం కట్టిన
'మధురాంతకం రాజారాం'

ప్రజాశక్తి - కడప అర్బన్

మనిషిని కేంద్రబిందువుగా చేసుకుని మానవత్వానికి పట్టం కట్టిన రచయిత మధురాంతకం రాజారాం అని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ కె.ఎన్.సుందరేశ్వర రావు పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 138వ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో 'మధురాంతకం రాజారాం జీవితం - సాహిత్యం' అనే అంశంపై డాక్టర్ కె.ఎన్.సుందరేశ్వరరావు ప్రసంగించారు. మధురాంతకం రాజారాం చిత్తూరు జిల్లా మొగరాల గ్రామంలో 1930, అక్టోబర్ 5న ఆదిలక్ష్మమ్మ, విజయరంగం పిళ్లై దంపతులకు జన్మించారని పేర్కొన్నారు. ఉద్యోగరీత్యా ఆ జిల్లాలోని పల్లెప్రాంతాల్లో పనిచేశారన్నారు. పాతతరం తెలుగు కథారచయితల్లో పేరెన్నికగన్న వారిలో మధురాంతకం రాజారాం ఒకరన్నారు. రాజారాం కథలు 1960-80 మధ్యకాలంలో ఊపిరి పోసుకున్నాయని, సమాజంలోని చెడును తాను గమనిస్తున్నా, ఆ చెడును విమర్శించే కంటే, మంచిని మాత్రమే చెప్పడం ఈయన ప్రత్యేకతని వివరించారు. ఆయన సుమారు 300కు పైగా కథలు, రెండు నవలలు, నవలికలు, నాటకాలు, గేయాలు, సాహితీవ్యాసాలు రచించారని పేర్కొన్నారు. 2023లో రాజారాం కథలన్నింటినీ 5 సంపుటాలుగా ఎమెస్కో వారు ప్రచురించారన్నారు. ఆయన కుమారులు మధురాంతకం నరేంద్ర, మహేంద్ర కూడా సాహిత్యంతో పెనవేసుకున్నవారే అన్నారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త డాక్టర్ కె.ఎన్.సుందరేశ్వర రావును సి.పి .బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, సిబ్బంది కలసి సత్కరించారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ మౌనిక, కె.వి.రమణారెడ్డి, శ్యామసుందర్ రెడ్డి, కొత్తపల్లె రామాంజనేయులు, పుత్తా పుల్లారెడ్డి, డాక్టర్ జి.వి.సాయిప్రసాద్, డాక్టర్ రాజగోపాల రెడ్డి, రాజారెడ్డి, పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి - కడప అర్బన్ : గిరిజన ఉద్యోగుల సమస్యలపై అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం పోరాడుతుందని జాతీయ అధ్యక్షులు పి.వి. రమణ పేర్కొన్నారు. ఆదివారం కడప జిల్లా గోల్డెన్ జూబ్లీ వేడుకలు, సమావేశం యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించారు. అధ్యక్షులుగా కావాడి కొండయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులు ఐక్య పోరాటాలు నిర్వహించి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజన ఉద్యోగులతో పటు ఇతర ఉద్యోగులను కలుపుకొని పోవాలని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ సహాధ్యక్షులు పి.చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నాగభూషణం, బంజారా సంఘ నాయకులు శివ నాయక్, పి ఆర్ టి నాయకులు తిరుపాల్ హాజరయ్యారు. సమావేశ అనంతరం కడప జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్. గంగాధర్ ప్రధాన కార్యదర్శిగా బాబు నాయక్, సహాధ్యక్షులుగా డాక్టర్ పి.మధుసూదన్, గంగాధర్, రామకృష్ణ, కె.బాలసుబ్బయ్య, శ్రీనివాసులు, ఓబులి రమేష్, 15 మంది కమిటీ సభ్యులుగా ఉన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల జెఎసి ఏర్పాటు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉమ్మడి కడప జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల సమావేశం ఆదివారం కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని కాంట్రాక్ట్ లెక్చరర్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వీరు కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్ కోసం చేయాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. అన్ని సంఘాలు కలిసి ఒక జెఎసి ఏర్పాటు చేసుకున్నారు. కడప జిల్లా నుంచి రాష్ట్ర జెఎసిలో ప్రాతినిధ్యం వహించడానికి వై.రామచంద్రారెడ్డి , టి.మన్సూర్ అలీ, చంద్రమోహన్ రెడ్డిని ఎన్నుకొన్నారు. కడప జిల్లా జెఎసి చైర్మన్‌గా యు. జానీ బాబును ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో రాయచోటి జోన్ నుంచి శివరామిరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి , రాధాకృష్ణ, ఇమాంతుల్లా, రాజంపేట జోన్ నుంచి హనీఫ్, సుబ్బయ్య, అమృతా దేవి, పులివెందుల జోన్ నుంచి రామ్మోహన్ రెడ్డి, ఇర్ఫాన్, మేడ శ్రీనివాసులు, జమ్మలమడుగు జోన్ నుంచి రామ్మోహన్, బెన్నీ, రామలక్ష్మి, కడప జోన్ నుంచి నాగేంద్ర, ఫక్రుద్దీన్, మధు శ్రీనివాస్, మల్లేశ్వరి, బద్వేల్ జోన్ నుంచి రంతు బాషను ఎన్నుకున్నారు.

2వ డివిజన్‌లో టిడిపి సభ్యత్వం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని 2డివిజన్ వైఎస్ఆర్ లేఔట్‌లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కడప నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఎద్దుల శంకర్, కృష్ణారెడ్డి ఆదేశానుసారం నిర్వహించారు. ఆదివారం తెలుగు యువత జిల్లా కార్యదర్శి అడవాల రాజా సభ్యత్వ కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్లి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వానికి కార్యకర్తల నుంచే కాకుండా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని చెప్పారు. సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాదం సంభవిస్తే రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకొని బీమాకు అర్హులు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయి, మదన్, రమేష్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేస్తున్న రాజా

ఓపెన్‌చెస్ టోర్నీ విజేతలు
సుభాని, మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని బెల్లంమండి వీధిలో ఉన్న ఇంటర్నేషనల్ ఫంక్షన్ ప్యాలెస్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో సంయుక్త విజేతలుగా కడప నగరానికి చెందిన అష్రఫ్ సుభాని, విజయవాడకు చెందిన సీనియర్ క్రీడాకారులు మల్లేశ్వరరావు నిలిచారు. ఏడు రౌండ్లకు గాను ఇద్దరు కూడా 6.5 పాయింట్లు సాధించి సంయుక్త విజేతలుగా నిలిచారు. విజేతలకు ఒక్కొక్కరికి రూ. 8500 నగదు బహుమతి అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన మేకల నాగేంద్రకు రూ. 5 వేల నగదు బహుమతి అందజేశారు. టోర్నమెంట్ విజేతలుగా నిలిచిన వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షులు వి. సత్యనారాయణ, కడప జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి చేతుల మీదుగా అందజేశారు. టోర్నమెంట్‌కు ఫీడె గుంటూరుకు చెందిన గోపీనాథ్, నేషనల్ సీనియర్ ఆర్బిటర్ రామ్, అసిస్టెంట్ ఆర్బిటర్ గా కడపకు చెందిన శ్రీకాంత్ వ్యవహరించారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అనీష్‌దర్బారి

బోధనేతర పనులు వద్దు : ఎస్‌టియు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ టీచర్ల పాలిట గుదిబండలుగా మారిన బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించి, ప్రశాంతంగా పిల్లలకు చదువులు చేప్పేలా చర్యలు చేపట్టాలని ఎస్‌టియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి హితవు పలికారు. ఆదివారం కడపలోని నాగార్జున మహిళా డిగ్రీకళాశాలలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులుఎస్.ఎం.డి.ఇలియాస్ బాష అధ్యక్షతన 78వ జిల్లా వార్షికకౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పేద, బడుగు, బలహీన, మధ్యతరగతి వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రోజుల తరబడి శిక్షణలు, రోజూ రకరకాల యాప్‌ల నిర్వహణతో బోధన ఎలా సజావుగా సాగుతుందో ఆలోచించాలన్నారు. వెంటనే ఉపాధ్యాయులను యాప్ ల నుంచి విముక్తి కలిగించాలన్నారు. ఖాళీలు ఉన్నచోట, ఉద్యోగ విరమణ చెందినవారి స్థానాలలో విద్యావాలంటీర్లను నియమించాలన్నారు. రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు కె.సురేష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థికపరమైన అంశాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే! అన్న చందాన ఏమాత్రం పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఉద్యోగుల పాలిట పీడకలలాంటి 11వ పిఆర్‌సి గడువు ముగిసి 16 నెలలు కావస్తున్నప్పటికీ మధ్యంతర భృతి(ఐఆర్), 12వ పిఆర్‌సి పట్ల దృష్టి సారించకపోవడం సరికాదన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లాకార్యదర్శి గాలి చంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రమణారెడ్డి, పి.శివశంకర్, కె.బాలగంగిరెడ్డి, పి.రషీద్ ఖాన్, బి.సుధాకర్ రెడ్డి,జిల్లా పరిశీలకులు పి.హరిప్రసాదరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి సంగమేశ్వరరెడ్డి, జిల్లా ఆర్థికకార్యదర్శి జి.రామ్మోహన్, సీనియర్ నాయకులు యు. జయరామయ్య, టి.వి.రమణయ్య, రాష్ట్రకమిటీ కన్వీనర్లు రామచంద్రారెడ్డి, శివారెడ్డి, సుబ్రమణ్యం, రవిశంకర్ రెడి, రాష్ట్రకౌన్సిలర్లు, జిల్లాకార్యవర్గ సభ్యులు, రీజనల్ బాధ్యులు, జిల్లాలోని మండలశాఖల ప్రధానబాధ్యులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియులు రాజకీయంగా ఎదగాలి

- కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్ : తొగటవీర క్షత్రియులు రాజకీయంగా ఎదగాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కనుమలోపల్లిలోని 108 శివలింగాల మహాలింగేశ్వర స్వామి సన్నిధిలో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే నాయకత్వం కింద పని చేస్తే రాజకీయంగా ఎదిగే అవకాశం ఉందన్నారు. రాజకీయ పార్టీలు కూడా అలాంటి వారిని గుర్తించి పెద్దపీట వేస్తాయన్నారు. రాష్ట్రంలో తొగట వీర క్షత్రియ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని, అందులో జిల్లాకు చెందిన వారికి కూడా భాగస్వామ్యం కల్పిస్తామని తెలిపారు. నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కళ్యా సుధాకర్, పల్లా నరసింహారావులు మాట్లాడుతూ సంఘం తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఐకమత్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. పిల్లలకు పెద్దలకు ఆటలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. నూతన సంవత్సరం కేలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంఘం మహిళ అధ్యక్షురాలు సురువు శ్రీలత, రాయలసీమ అధ్యక్షులు బొమ్మల వెంకటరత్నం, జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ, నగర శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం ,కోశాధికారి టేకూరు సుదర్శన్ ,ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లా మురళి కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు చౌడం సూరిబాబు, సుంకర రామచంద్రుడు, సంగీనాథం ఆంజనేయులు, గోవింద నాగరాజు ,సిఆర్ఐ సునీల్ జయంత్, పల్లా బాలచౌడన్న, బొలిశెట్టి వెంకటస్వామి పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్నకదిరి ఎమ్మెల్యే, సంఘం నాయకులు

అండర్-23 ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

- ఆరు వికెట్ల తేడాతో ఈస్ట్ గోదావరి విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడపలో ఎసిఎ అండర్ -23 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్ జట్టుపై ఆరు వికెట్ల తేడాతో ఈస్ట్ గోదావరి జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 38.5 ఓవర్లలో 264 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సాయి పూర్ణ తేజ 62, హర్షవర్ధన్ 47 పరుగులు చేశారు. ఈస్ట్ గోదావరి జట్టులోని వంశీ నారాయణ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి నాలుగు వికెట్లు తీసుకున్నాడు. సందేశ్ రెండు, శివ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 165 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఈస్ట్ గోదావరి జట్టు 41.1 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని సూర్య చైతన్య 43, విజయ్ 41 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని గణేష్, రవి కిరణ్, హేమంత్, సిద్ధార్థ లు ఒక్కో వికెట్ తీసుకున్నారు.

వైఎస్ఆర్ ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లోఅనంతపురం జట్టుపై మూడు వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌దిగిన అనంతపురం జట్టు 49.2 ఓవర్లలో 216 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ప్రాజెక్టులోని మహేంద్ర రెడ్డి 95 (నాట్ అవుట్), దత్త రెడ్డి 37 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ జూన్ గట్టులోని సాకేత్రామ్ మూడు, పూజిస్ సాత్విక్ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 217 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ తో దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 46.5 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసి మూడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని సుబ్రహ్మణ్యం 73, శశాంక్ శ్రీ వాస్తవ 52 పరుగులు చేశారు. అనంతపురం దొడ్డిలోని దత్తారెడ్డి 3, ప్రదీప్ రెడ్డి 2, దీపక్ 2 వికెట్లు తీసుకున్నారు.

తలపడుతున్న అనంతపురం, రెస్టాఫ్ సౌత్ జోన్ జట్లు

కెఎస్ఆర్ క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో ప్రకాశం జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జట్టు 46.5 ఓవర్లలో 224 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని అభినవ్ 83, లేఖజ్ రెడ్డి 33 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని సుశాంత్ నాయుడు 3 సమన్విత్ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 225 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 42.2 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ చెట్టులోని ఖాజా మొహిద్దిన్ 72, సమన్విత్ 57 (నాట్ అవుట్) పరుగులు చేశారు. ప్రకాశం జట్టులోని పవన్ కుమార్ మూడు వికెట్లు తీసుకున్నాడు.

రోడ్డును కమ్మేసిన మంచు

మంచుతో.. చలికాలం జర భద్రం

ప్రజాశక్తి - తొండూరు

రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు ఉంటుంది. చలికాలంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న వ్యాధులు బారిన పడుతారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు చలికాలంలో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అవసరమేరకు వారు బయటకు వస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. ప్రస్తుత కాలంలో డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు బారినపడే పరిస్థితి. తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ సిబ్బంది సూచిస్తున్నారు.

నేడు గురుకుంట తిరుణాల

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని గురిజాల సమీపంలో సోమవారం గురుకుంట తిరుణాల నిర్వహిస్తున్నారు. ఆ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది కార్తీక మాసం చివరి సోమవారం గురుకుంట క్షేత్రంలో వెలసిన ఆంజనేయ స్వామి, శివాలయంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. గత ప్రభుత్వ హయాంలో గురుకుంట క్షేత్రంలో కమ్యూనిటీ భవనం, ప్రహరీ, క్షేత్రం నుంచి రోడ్డు వరకు తారురోడ్డు ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో కల్యాణ మండపాన్ని నిర్మించారు. తిరుణాల సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు అన్ని చర్యలు చేపట్టారు. పులివెందుల ఆర్‌టిసి డిపో నుంచి గురుకుంట క్షేత్రం మీదుగా ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక అహోబిలపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం కడప బాలోత్సవం వారు పులివెందుల నియోజకవర్గం పరిధిలోని అన్ని యాజమాన్య పాఠ శాలల హైస్కూల్స్ విద్యార్థులకు నిర్వ హించిన చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వాహించారు. సీనియర్స్ విభాగానికి 'పర్యావరణ పరిరక్షణ', జూనియర్స్ విభాగానికి 'మా కుటుంబం' అనే అంశాల మీద పోటీలను నిర్వహించారు. దాదాపు 1000 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి ధన్యశ్రీ, రెండవ బహుమతి జస్వంత్, మూడో బహుమతి ఎస్ హిమశ్రీ.. సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతి బి మిధున, బి గంగా, బి పవన్ రెండు, మూడు బహుమతులు గెలుచుకున్నారు. 10 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కడప బాలోత్సవం అధ్యక్షులు జి గోపాల్, కార్మిక నాయకుడు గఫూర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మద్దతు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొత్త లక్ష్మీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి, ఉపాధ్యాయ సంఘం నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వైవీయు ఫైన్ ఆర్ట్స్ విభాగ అధ్యాపకులు చిన్న రాయుడు, ఈరప్ప, డ్రాయింగ్ అధ్యాపకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మధు, జన విజ్ఞాన వేదిక నాయకులు శివరాం, నాయకులు నారాయణరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

హోమియో మందులు ఉచితంగా పంపిణీ

వేంపల్లె : స్థానిక శ్రీ వాసవి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు ఆవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్ చెప్పారు. ఆవోపా సేవా సంస్థ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కడపకు చెందిన వైద్యుడు క్రిష్టపాటి వెంకట శేషఫణి వైద్య సేవలు అందించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దాదాపు 90 మంది రోగులకు పరీక్షించినట్లు సునీల్‌కుమార్ తెలిపారు. ఆవోపా మాజీ అధ్యక్షుడు కొప్పరపు అశోక్‌కుమార్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి కొప్పరపు నాగసుధామణి ఆవోపా అభివృద్ధికి రూ.50 వేల చెక్కును అందజేశారు. అనంతరం ఆవోపా ఆధ్వర్యంలో నాగ సుధామణిని సన్మానించారు. కార్యక్రమంలో ఆవోపా సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విఆర్ఎ మృతి

వీరపునాయునిపల్లె : మండలంలోని తగేండుపల్లె విఆర్ఎ దరియ చంద్ర (47) అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొద్ది రోజులుగా చంద్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించి ఆదివారం చనిపోయాడు. చంద్ర నేత్రాలను బంధువులు ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి అందజేశారు. ఆయనకు తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గ్రామానికి మంచి సేవలు అందించినట్లు తోటి విఆర్ఏలు, విఆర్ఓలు కొనియాడుతూ నివాళులర్పించారు.

క్రైం కార్నర్

గొడ్డలితో దాడి.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మృతుడు వీరనారాయణ యాదవ్

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని భూమాయపల్లె గ్రామ పొలాల్లో ఓ వ్యక్తిని గొడ్డలితో నరికి చంపిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామానికి చెందిన చింతకుంట వీరనారాయణ యాదవ్ (43) హత్యకు గుర య్యారు. మృతుడు ట్రాక్టర్ బాడుగలకు వెళుతూ జీవనోపాధి పొందు తున్నాడు. అదే గ్రామానికి చెందిన తన సమీప బంధువు బాలకృష్ణ పొలాన్ని వీరనారాయణ యాదవ్ దుక్కులు చేశాడు. బాడుగ చెల్లించకుండానే మూడు నెలల కిందట బాలకృష్ణ ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లాడు. బాడుగ డబ్బు ఇవ్వా లంటూ వీర నారాయణ యాదవ్ బాలకృష్ణ భార్య శిరీషను తరచు అడుతుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో మృతుడు తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని శిరీష కువైట్‌లో ఉన్న భర్త బాలకృష్ణకు సమాచారం చేరవేసింది. దీనిపై ఆగ్రహించిన బాలకృష్ణ సోదరుడు సుబ్బరాజుకు విషయాన్ని చేరవేశాడు. దీనిపై కక్ష పెంచుకున్న సుబ్బరాజు భూమాయపల్లె సమీప పొలాల్లో ట్రాక్టర్‌లో ఉల్లి పొట్టు నింపుతూండగా గొడ్డలితో వీర నారాయణపై దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వీర నారాయణను ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. వీర నారాయణ యాదవ్ సోదరుడు సుబ్బరాయుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యవసాయ పరికరాలు ధ్వంసం

ప్రజాశక్తి - ముద్దనూరు

పొలం వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయ పరికరాలను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు బాధితుడు వెన్నపూస సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఓబుళాపురం పాఠశాలలో తాను ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నానన్నారు. గంగాదేవిపల్లెలో వ్యవసాయ పొలం ఉందన్నారు. పొలం వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయ పరికరాలు మోటర్, ఆటో స్టార్టర్, పైపులు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని తెలిపారు. ప్రస్తుతం కొండాపురంలో నివాసం ఉంటు న్నానన్నారు. ముద్దనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు భాదితుడు చెప్పారు.

బడిలో పిల్లలు భద్రమేనా..?

భయం..భయంగా.. ప్రభుత్వ పాఠశాలలో చదువు

భద్రతలేని కొత్త బస్వాపురం ప్రాథమిక పాఠశాల

కూలిన పాఠశాల ప్రహరీ (ఇన్‌సెట్) పెచ్చులూడుతున్న తరతగతి గది

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని కొత్త బస్వాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు భయం.. భయంగా చదువుతుకుంటున్నారు. చిన్నపాటి వర్షానికే ప్రహరీ కూలింది. పాఠశాల పెకప్పు పెచ్చులూడి ఎప్పుడు తమపై పడు తాయోనని చిన్నారులు భయంగా గడుపుతున్నారు. పొరపాటున పిల్లలు ఆడుకుంటూ ప్రహరీ వద్దకు వెళితే ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు అంటూ విద్యార్థుల తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 28 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు పనులలో అనేక పాఠశాలలు సుందరీకరణ చేస్తే.. ఈ పాఠశాల అధికారులకు కనిపించకపోవడం చాలా బాధాకరమని పలువురు పేర్కొంటున్నారు. మండల విద్యాశాఖాధికారి స్పందించి ఇలాంటి పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సేవా దృక్పథమే ఆశయం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల టౌన్ : చెక్కును అందజేస్తున్న ఆర్‌డిఒ, సభ్యులు

సేవా దృక్పతమే తన ఆశయమని ఆర్‌డిఒ భానుశ్రీ పేర్కొన్నారు. స్థానిక మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలనే దృఢ సంకల్పంతో తాను ఈ ఉద్యోగ జీవితంలో చేరానని తెలిపారు. సాఫ్ట్వేర్ రంగంలో పనిచేస్తున్న తాను పేద ప్రజలకు సేవ చేసే ఆలోచనతో ఆర్‌డిఒగా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. మానవత సేవా సంస్థ గురించి తాను ఇదివరకే విన్నానని, సేవా కార్యక్రమాల గురించి కూడా తెలుసుకున్నామని చెప్పారు. మానసిక వికలాం గుల ఆశ్రమానికి మానవత సంస్థ నిధి నుంచి రూ.6వేల చెక్కును ఆర్‌డిఒ చేతుల మీదుగా ఆశ్రమ నిర్వాహకులు జనార్ధన్‌రెడ్డికి అందజేశారు. సమా వేశానికి విచ్చేసిన గౌరవ సభ్యులకు మానవత అధ్యక్షులు జయరాజు అల్పా హారం ఏర్పాటు చేశారు. అనంతరం మానవత స్వచ్ఛంద సేవా సభ్యులు ఆర్ డిఒను సత్కరించారు. కార్యక్రమంలో సేవా సంస్థ సమావేశం రీజియన్ కన్వీ నర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి, సంస్థ చైర్మన్ కొండారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చవ్వా కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరు మెజిస్ట్రేట్ శ్రీనివాసులు, కార్యదర్శి గంగిరెడ్డి, ఎస్సీ ఎస్సార్ అధినేత సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

సేవాభావం అందరిలో ఉండాలి : ఎస్‌ఐ

వేంపల్లె : సేవాభావం అనేది ప్రతి ఒక్కరిలో ఉండాలని ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న వృద్ధాశ్రమానికి అమ్మ అనాథ వృద్ధుల శరణాలయం అనే పేరును నామకరణం చేశారు. ఈ నేపథ్యంలో మానవత సేవా సమితి ఆధ్వర్యంలో శరణాలయంలో మాజీ ఎంపిటిసి జీవి రమణను మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం వృద్ధులకు ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్యను పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి, చక్రపాణిరెడ్డి, మానవత సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జివి రమణ, మానవత సేవా సంస్థ మండల శాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ యోగిస్వర్ బాబు, ప్రాంతీయ చైర్మన్ చల్లా బాలాజీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'ఉయ్యాలవాడ'కు ఘన నివాళులు

'ఉయ్యాలవాడ'కు నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

భరతమాత ముద్దుబిడ్డ దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు పోరాడి అసువులు బాసిన ఉయ్యాలవాడు నరసింహారెడ్డి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఉయ్యాలవాడు నరసింహారెడ్డి కాంస్య విగ్రహానికి రేనాటి సూర్యచంద్రుల సేవాసంఘం అధ్యక్షులు డాక్టర్ వై.వి.స్వరూప్‌కుమార్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ టిటిడి బోర్డు సభ్యులు మారుతి ప్రసాద్, కోశాధికారి ఓబులరెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : భారత ప్రథమ స్వాతంత్ర సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు నివాళులర్పించారు. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమీపంలో ఉన్న అంధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్‌సిడిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల వెంకట సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఒంటెద్దు నాగేశ్వర్‌రెడ్డి, సివిల్ సప్లై మాజీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, కల్లూరు నిరంజన్ రెడ్డి, గంగిరెడ్డి, ఉలిమెల చంద్ర, ఉలిమెల్ల నీలకంఠరెడ్డి పాల్గొన్నారు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్వాతంత్ర సమరయోధులు, తెలుగు తొలి విప్లవకారుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటిష్ వారిని ఎదిరించి, వారికి ముచ్చె మటలు పట్టించిన మహా గొప్పవ్యక్తి అని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారుపల్లె జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానంద క్లాత్ మార్కెట్ ఎదురుగా ఉన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లదిమ్మురెడ్డి గారి వెంకటేశ్వరరెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి ఎల్లారెడ్డి, ప్రొద్దుటూరు మండల ఉప మండల అధ్యక్షులు అసం దస్తగిరిరెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు వార్తల కృష్ణమోహన్ రెడ్డి, బొమ్ము లక్ష్మీ పుల్లారెడ్డి, నారుపల్లె లక్ష్మి నారాయరెడ్డి, ఆర్ట్స్ కాలేజ్ వ్యాయామ విశ్రాంత అధ్యాపకులు కోట ఓబుల్‌రెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయులు గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి రేనాటి సూరీడు, తెలుగు వీరుడని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి సందర్భంగా కాంగ్రెస్ కార్యాలయంలో నరసింహారెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించారు.

బ్రెడ్, పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

ఎన్‌సిసితో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆదివారం ఎన్‌సిసి డేను ఘనంగా నిర్వహించారు. ముందుగా కరస్పాండెంట్ పాల నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి ఎన్‌సిసి డేను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, యూనిటీతో ఉండే భావాలతో నెలకొల్పబడిన ఎన్‌సిసిలో ఉండడం గర్వకారణమని కొని యాడారు. స్థానిక వృద్ధాశ్రమంలో బెడ్‌షీట్లు, పండ్లు ఇచ్చి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్ట్‌నెంట్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సిసి ద్వారా జాతీయ స్థాయి ఉద్యోగాలు ఎంతోమంది పొందారన్నారు. రిజర్వేషన్లు కూడా ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ సంస్థల తరలింపు దారుణం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాయలసీమలోని ప్రధాన కార్యాలయాలను కూటమి ప్రభుత్వం అమరావతికి తరలించే సన్నాహాలు చేయడం దారుణమని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప కొప్పర్తిలో ఉన్న ఎంఎస్‌ఎంఇ టెక్నాలజీ సెంటర్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం అమరావతికి తరలించాలని నిర్ణయిస్తున్నారని, ఇది దారుణమన్నారు. ఇలాంటా ఆలోచనలను ఆపాలని, పాలకులు ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. సమావేశంలో డివైఎఫ్‌ఐ పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్, నాయకులు సుభాన్ పాల్గొన్నారు.

అధిక నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మీదుగా వెళ్లే చాగలమర్రి-రాయచోటి బైపాస్ రోడ్డులో భూములు, ఇళ్లు కోల్పోయే బాధితులకు, రైతులకు అధికంగా నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బైపాస్ రోడ్డులో భూములు, ఇళ్ల, ఇంటి స్థలాలు కోల్పోయే రైతులు, ఇంటి యాజమానులతో నష్ట పరిహారంపై తహశీల్దార్ హరినాథ్ రెడ్డి సమావేశం నిర్వహించారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని తహశీల్దార్ కోరారు. రెండు భాగాలుగా విభజించి ప్రభుత్వం బాధితులకు పరిహారం ఇస్తుందని తహశీల్దార్ చెప్పారు. ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇస్తే రైతులు నష్ట పోతారని, రూ.30 లక్షలు ఇవ్వాలని రామమునిరెడ్డి కోరారు. ఈ విషయాన్ని పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. సమావేశంలో టిడిపి మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, రైతులు పుల్లారెడ్డి, నాగేంద్ర, కొత్తూరు రాజా, వెంకట్రామిరెడ్డి, రాజన్న, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

వేంపల్లె : స్థానిక పులివెందుల-కడప రోడ్డు పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ కోరారు. ఆది వారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.1లక్షా 50 వేలు కోట్లు కాంట్రాక్టర్లుకు బకా యిలు ఉన్నప్పటికీ వేంపల్లెలో నిలిచి పోయిన రోడ్డు పనులకు చెందిన బిల్లు లను సిఎం చంద్రబాబు రూ.9 కోట్లు విడుదల చేశారన్నారు. బిల్లులు మం జూరు అయినప్పటికీ కాంట్రాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి 3 నెలలుగా పనులు ప్రారభించలేదన్నారు. కాంట్రాక్టర్ నిర్వాకంతో కూటమి ప్రభుత్వం అప్రతిష్ట పాల వుతుందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు బాలస్వామి రెడ్డి, జగన్నాథరెడ్డి, గొటూరు నాగభూషణం, మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని గ్రామ వార్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జియో టాగింగ్ విధానంలో 40 క్లస్టర్‌లు ఉన్న సచివాలయాల్లో దాదాపు 2,500కు పైగా కేవలం ఐదు మంది సిబ్బంది మాత్రమే మ్యాప్ చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. సర్వేల నుండి సచివాలయ సిబ్బందిని మినహాయింపు కలిగించాలన్నారు. టైంబౌండ్ సర్వేలు నిర్వహించమని ఆదేశాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎడ్యుకేషన్ సహాయకులు తీవ్ర పనిభారంతో ఇబ్బందులు పడుతున్న విషయం ప్రభుత్వం గ్రహించాలని కోరారు. ఇప్పటి వరకు సర్వీస్ రూల్స్‌గాని ప్రమోషన్ ఛానల్‌గాని వారికి ఇవ్వలేదని, దీనిపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని మస్తాన్ కోరారు.

టిడిపిలో చేరిన భాను ప్రకాష్‌రెడ్డి అనుచరులు

ఆంధ్ర పరువు తీసిన జగన్‌రెడ్డి

ప్రజాశక్తి - లింగాల

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో అవినీతికి తెర తీయడంతో దొంగగా ముద్ర పడడంతో ఆంధ్ర పరువు తీశాడని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తి పాలన నచ్చక ప్రజలు క్రమంగా టిడిపిలోకి చేరుతున్నారన్నారు, లింగాల మండల బాధ్యుడు సంజీవరెడ్డి, మండల ఇన్‌ఛార్జి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో కామసముద్రంకు చెందిన వైసిపి భాను ప్రకాష్‌రెడ్డి, ఆయన వర్గీయులు 40 కుటుంబాలు ఆదివారం టిడిపిలో చేరాయి. వీరికి బీటెక్ రవి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రవి విలేకరులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి అవినీతి పాలనతో ప్రజలు విసుగెత్తిపోవడంతో టిడిపికి అధికార పగ్గాలు ఇచ్చారన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి దొంగ సర్వే నెంబర్లు సృష్టించి అటవీ శాఖ భూములు ఆక్రమించి సాగు చేసిన ఘనత వారికే దక్కుతుందని విమర్శించారు. ఫ్యాక్షన్‌ను రూపుమాపి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వేంపల్లి మండల ఇన్‌ఛార్జి రఘునాథ్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జొన్నలగడ్డ ధనుంజయ నాయుడు, టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

సేవం జిల్లా అధ్యక్షుడిగా వసంత ఎన్నిక

ప్రజాశక్తి - దువ్వూరు

జాతిపిత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో 18ఏళ్లుగా వివిధ క్యాడర్లలో పనిచేస్తూ, ప్రస్తుతం దువ్వూరు ఎపిఒగా పనిచేస్తున్న డాక్టర్ భూమిరెడ్డి వసంత కుమార్ సేవం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ మేరకు ఆదివారం వసంత కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన, వెల్ఫేర్ అసోసియేషన్ ఇంతవరకు లేదన్నారు. ఈ మధ్యనే రాష్ట్ర స్థాయిలో సేవం అనే వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటైందన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని అన్ని క్యాడర్స్‌తో కలిసి మైదుకూరులో సమావేశమై వెల్ఫేర్ అసోసియేషన్ కడప జిల్లా శాఖ ఏర్పాటైందన్నారు. ఉపాధ్యక్షులుగా సుధారాణి, జయచంద్రబాబు, సెక్రటరీగా ప్రతాప్, జాయింట్ సెక్రెటరీగా అన్నా నాయక్, ట్రెజరర్స్‌గా చంద్రశేఖర్, ఓబులేసును ఎన్నుకున్నట్లు తెలిపారు.

శ్రీరంగనాథ స్వామి సన్నిధిలో కార్తీక వనభోజనం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో వెలిసిన శ్రీరంగనాథ స్వామి దేవస్థాన సన్నిదిలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీవీరశైవ లింగాయతి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ రంగనాథ స్వామికి పూజా కార్యక్రమాలు, అభిషేకాలు ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణ రాజేష్‌శర్మ నేతృత్వంలో నిర్వహించారు. వీరశైవ లింగాయతి నాయకులు, ఉపాధ్యాయ సంఘనేత అంగడి నాగేంద్ర ఆధ్వర్యంలో పిల్లలు, మహిళలకు ఆటల పోటీలు, మ్యూజికల్ చైర్స్, పెద్దవారికి త్రో బాల్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సంఘం ముఖ్య నాయకులు సుంకర వీరయ్య, చాట్ల వీర భద్రయ్య, ఉపాధ్యాయ సంఘ నేత అంగడి నాగేంద్ర, రిటైర్డ్ ఉపాధ్యాయులు గడ్డం కైలాసం, చట్టా చంద్రశేఖర్, సుంకర కార్తీక్, పన్నీరు సుధాకర్, అంగడి రాజేంద్ర, చాట్ల రవిశంకర్, సుంకర వీరశేఖర్, రంగసముద్రం నటరాజ్, మంచిరెడ్డి దని, విరూపాక్షి చంద్రశేఖర్, చాట్లశశి భూషణ్,మల్లికార్జున, విజయ్,శిరిగిరి కిషోర్,చట్టా సురేంద్ర, విరూపాక్షి ధనుష్, శ్రీ రంగనాథ దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కొట్టే వెంకటరమణ, జర్నలిస్ట్ సంఘం నేత అల్లం రంగనాయకులు రాయల్, గూడూరు జగన్, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

రక్తదానం.. మహాదానం

ప్రజాశక్తి - వేంపల్లె

రక్తదానం మహా దానమని, రక్త దాతలు ప్రాణ దాతలని తులసిరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ రక్త దాన దినోత్సవం సందర్భంగా రక్తదాన ఆవశ్యకతను తులసిరెడ్డి వివరించారు. ఆరోగ్యవంతులైన వారు ప్రతి 3 నెలలకొకసారి రక్త దానం చేయవచ్చు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, చెన్నకేశవ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రమణ, మాష్, బద్రి, వేమా రాజా, బాలం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కోలాటం వేస్లున్న చిన్నారులు

ఆకట్టుకున్న కోలాటం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక పీడబ్ల్యుడి బంగ్లా సమీపంలోని శివభక్తేంద్ర స్వామి ఆలయంలో 30 ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పలు పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం అందరినీ అలరించింది.

IN THE COURT OF THE HON'BLE III ADDL., JUNIOR CIVIL JUDGE, KADAPA
O.S. No. 153/2024

Andhra Pragathi Grameena Bank, Represented by its Branch Manager, NESCO Branch, Kadapa. ....Plaintiff

Vs.

Kethireddy Ramachandra Reddy, S/o. K. Gangi Reddy, Hindu, aged about 40 years, Business, residing at D.No. 8/572, Niranjan Nagar, Kaapa city, having died his legal representatives Father, Mother and Wife i.e. defendants No.1 to 3.
1. Kethireddy Gangi Reddy, S/o. K. Rami Reddy, Hindu, aged about 62 years, Business.
2. Kethireddy Sugunamma, W/o. K. Gangi Reddy, Hindu, aged about 56 years, Housewife.
3. Kethireddy Anithamma, W/o. Late K. Ramachandra Reddy, Hindu, aged about 36 years, Business. D-1 to D-3 are residents of D.No. 8/572, Niranjan Nagar, Kadapa city.
4. Thummala Malla Reddy, S/o. T. Rami Reddy, Hindu, aged about52 years, Business, residing at D.No. 6/137, Chinna Chowk, Kadapa city & District. .... Defendants

NOTICE TO DEFENDANTS No.3 & 4

Please take notice that the Hon'ble Court has ordered for notice to the defendants No.3 & 4 to appear on 27-11-2024 at 10:30 A.M. in the above Court, failure to appear by you the matter will be decided exparte.

//BY ORDER OF THE HON'BLE COURT//

Sd/-B. SYAM SUNDER,
Advocate for plaintiff, KADAPA.

In The Court of The senior Civil Judge, Kavali
OS NO: 148/2010

Between :
S.Upendra Narayana and others - Plaintiffs
Vs
K.Chenchamma and others - Defendents

To,
D14) **KancharlaSubbanaidu,**
S/o Late **Venkateswarlu,**
D.No. 36/256-55-2C Hanuman Nagar,
:Kadapa -516001.
D15) **Kancharla Suresh,**
S/o Late Venkateswarlu,
D.No. 361,BhagyaNagar Colony,
Kadapa - 516001. అనువారికి,

వాది మీపై దావా దాఖలు చేసి యున్నందుకు మీకు నోటీసు నిమిత్తం **తే09-12-2024ది.** కి వాయిదా వేయబడి ఉన్నది. ఆ దినం **పగలు 10.30.గం. లకు** పై కోర్టు వారి ఎదుట మీరు హాజరై, అక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల నీ పరోక్షమందు ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

ఇట్లు,
N.S. కిరణ్ కుమార్,
వాది తరుపు న్యాయవాది, కావలి.